# నశించిన మానవుని పట్ల దేవుడు అక్కర కలిగియున్నాడా?

"యెహోవానైన నేను మార్పులేనివాడను" (మలాకీ 3:6). దేవుడు ఎన్నడు మారని వాడైనందున, నశించిన నరుని పట్ల దేవుడు అక్కర కలిగియున్నాడా లేదా తెలిసికొనడానికి, ఒకడు గతంలోనికే చూడవలసి యుంటుంది. గతంలో ఆయన అక్కర కనుపరచినట్టయితే, యిప్పుడు వేరుగా ఉండదు. "ఎందుకంటే ఆయన నిన్న, నేడు, నిరంతరం ఏకరీతిగా ఉన్నాడు" (హెబ్రీ. 13:8).

## కయీను పట్ల ఆయన అక్కర

గతాన్ని ఒకడు వీక్షించితే, ఈ మహా విశ్వమంతటికి నిర్వాహకుడు భువికి దిగివచ్చి భూమిమీదనున్న ఒక నరునితో మాట్లాడ సమయాన్ని తీసుకొన్నాడు: అది కూడా, పాప భరితుడై, కోపముతోనుండి ముఖం దించుకున్న కయీనుతో మాట్లాడడానికి, "సత్క్రియ" చేయడానికి కయీనుకు తరుణం యివ్వబడింది (ఆది. 4:7); అయితే అతడు తప్పుచేయ కోరుకున్నాడు సత్క్రియ చేయ కోరలేదు. సమస్త హక్కులతోనున్న విరామం లేని పరలోకపు దేవుడు పరలోకంలోనే నిలిచియుండి, అవిధేయుడైన కనానును అలక్ష్యం చేసియుండేవాడే; అయితే పాపి యెడల ఆయనకున్న అక్కర పరలోకాన్ని వీడి ఒక వ్యక్తితో వ్యక్తిగతంగా పని చేయడానికి దేవుడు దిగివచ్చాడు.

కయీనును రక్షించడానికి దేవుడు ప్రయత్నించాడు. నరుడు పాపం మీద ఏలుబడి చేయడానికి అవకాశముంది, దేవునిచే అంగీకరింపబడడానికి వీలుందని ఆయన కయీనుతో వివాదించాడు (ఆది. 4:7). దేవుని ప్రతిపాదనలకు కయీను తగినట్టు బదులివ్వనంత మాత్రాన అతని పట్ల ఆయన అక్కర తగ్గిపోలేదు. కీడు చేయడాన్ని కయీను కోరుకున్నందుకు దేవుడు గాయపరచబడ్డాడు.

## నోవహు సమకాలికుల పట్ల ఆయన అక్కర

నోవహు దినాల్లో, శరీరేచ్ఛలకు జనులు తమ్మును తాము లోబరచుకొని, "వారందరిలో తమకు మనస్సువచ్చిన స్త్రీలను వివాహము చేసికొనిరి" (ఆది. 6:2), పవిత్రుడును ప్రేమామయుడునైన దేవుడు మనస్సున గాఢంగా బాధింపబడ్డాడు. "తాను భూమి మీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చు కొనెను" (ఆది. 6:6). తప్పు చేసినందున మనస్సు మార్చుకొనడం అనే భావనలో,

మారుమనస్సు పొందడం దేవునికి అసాధ్యం (1 సమూ. 15:29). మనుష్యుని వక్ర ప్రవర్తనను బట్టి దేవుడు సంతాపపడడం, బాధననుభవించడం అనే విషయాలలో దేవుడు పశ్చాత్తాపపడ్డాడు (హెబ్రీ.: *naham*; 1 సమూ. 15:11, 35; న్యాయాధి. 2:18; యిర్మీయా 42:10), పశ్చాత్తాపపడుతూ ఉంటాడు (ప్రకటన 3:20).

మానవుల పట్ల దేవునికిగల ప్రేమ పాపాన్ని అలక్ష్యం చేసేలా నడిపించలేదు సరిగదా, శిక్షను ఆపలేదు లేక తొలిగించలేదు. నోవహు యొక్క ప్రకటన ద్వారా దేవుని విన్నపాన్ని 120 సంవత్సరాలు విన్న నోవహు సమకాలికులు ఆయన ఉగ్రతను అనుభవించారు, ముంచివేయబడ్డారు. వారి నాశనం దేవుని యిష్టం కాదు. తమ్మును శిక్షించునట్లు పాపులు ఆయనను బలవంత పెట్టుతారు.

## మోయాబు పట్ల ఆయన అక్కర

లోతు సంతతియైన మోయాబీయులు జారత్వం జరిగించి విగ్రహాలకు బలులు అర్పిస్తుండేవారు, అయినా, యింకను దేవుడు వారిని ప్రేమించాడు; వారిపట్ల ఆయనకున్న అక్కర గాఢంగా ఉండేది. "మోయాబు నిమిత్తము నా హృదయము అరచుచున్నది" అని ఆయన తెలిపాడు (యెషయా 15:5). "మోయాబు నిమిత్తము నా గుండె కొట్టుకొనుచున్నది కీర్హరేశు నిమిత్తము నా ఆంత్రములు సితారావలె వాగుచున్నవి" (యెషయా 16:11). మోయాబీయులు నీతికి దూరముగా తొలిగిపోయినా (సంఖ్యా. 25:1–5 చూడు), దేవుని భద్రతలోనుండి వారు తొలిగి పోవడం అసాధ్యంగా కన్పించింది.

## నీనెవె పట్ల ఆయన అక్కర

అలాగే నీనెవె మహా నగరంలో నివసించిన అష్షూరీయులు నీతినుండి తొలిగి పోయారు. (వారి "దోషము నా దృష్టికి ఘోరమాయెను" అని మహోన్నతుడు తెలిపాడు; యోనా 1:2.) దయగల హృదయంతో దేవుడు మానవ క్షేమాన్ని కోరతాడు. నీనెవెలో ప్రవర్తన యొక్క దిద్దుబాటును కలిగించగలిగే ఆత్మలను సంపాదించగల సమర్థుని ఆయన అక్కడికి పంపాడు. చివరికి యోనా అక్కడికి చేరిన తరువాత, గొప్ప కార్యాన్ని అతడు జరిగించాడు. ఆ పట్టణమంతా మరుమనస్సు పొందినప్పుడు దేవుని హృదయం బహుగా ఆనందించింది.

నశించిన వారిపట్ల యోనాకే సరియైన స్వభావం లేదు. నశించిన వారిపట్ల దేవునికి కలిగిన ప్రేమవంటిది అతనికి లేకపోయింది. నాశనమౌతున్న వారిపట్ల అక్కర కలిగి ఉండాలని ఆయన అతనికి చూపాడు – వారు "కుడియెడమలు ఎరుగని జనమని" ఆయన వర్ణించాడు (యోనా 4:11).

## అవిధేయులైన ఇశ్రాయేలీయుల పట్ల ఆయనకున్న అక్కర

అబ్రాహాము సంతతివారు తీవ్రమైన బానిసత్వంలోను ఐగుప్తులోని కఠినమైన

వెట్టిపనులు చేయించే యజమానుల క్రింద వారు అనుభవిస్తున్న శ్రమను చూచి పరలోకమందున్న దేవుడు బాధపడ్డాడు. ఆయన యిలా అన్నాడు,

> నేను ఐగుప్తులోనున్న నా ప్రజల బాధను నిశ్చయముగా చూచితిని, పనులలో తమ్మును కష్టపెట్టువారిని బట్టి వారు పెట్టిన మొరను వింటిని వారి దుఃఖములు నాకు తెలిసే యున్నవి (నిర్గమ. 3:7).

ఆయన వారి విడుదలకు సంబంధించిన క్రియ జరిగించాడు, దానిని గూర్చి వారికి తెలియజేయడానికి ఆయన ఆనందించాడు:

> ఇశ్రాయేలు బాలుడైయుండగా నేను అతనియెడల ప్రేమగలిగి నా కుమారుని ఐగుప్తుదేశములోనుండి పిలిచితిని ... ఒకడు మనుష్యులను తోడుకొని పోవునట్లుగా స్నేహబంధములతో నేను వారిని బంధించి ఆకర్షించితిని; ఒకడు పశువులమీదికి కాడిని తీసినట్లు నేను వారి కాడిని తీసి వారి యెదుట భోజనము పెట్టితిని (హోషేయ 11:1, 4).

ఆయన కనికర కార్యాలను ఇశ్రాయేలీయులు అభినందిచాలని ఎదురు చూచిన దేవుని ప్రేమా హృదయం గాఢంగా బాధపడింది:

> వారికిని వారి సంతానమునకును నిత్యమును క్షేమము కలుగునట్లు వారు నాయందు భయభక్తులు కలిగి నా ఆజ్ఞలన్నిటిని అనుసరించు మనస్సు వారికుండిన మేలు (ద్వితీయో. 5:29).

వారు అపవాదిని సేవించి అక్రమములో జీవించినప్పుడు సయితము దేవుడు వారిని కాపాడుతూనే వచ్చాడు. ఆయన వారితో యిలా విన్నవించుకున్నాడు:

> నా జీవముతోడు దుర్మార్గుడు మరణము నొందుటవలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గతనుండి మరలి బ్రదుకుటవలన నాకు సంతోషము కలుగును. కాబట్టి ఇశ్రాయేలీయులారా, మనస్సు త్రిప్పుకొనుడి, మీ దుర్మార్గతనుండి మరలి మనస్సు త్రిప్పుకొనుడి, మీరెందుకు మరణము నొందుదురు? ఇదే ప్రభువగు యెహోవా వాక్కు (యెహెజ్కేలు 33:11).

పరలోకపు తండ్రి దుష్టత్వంతో రాజీపడలేదు. మాటిమాటికి ఆయన తన పిల్లలను గద్దించాడు, కాని అది వారిని బాధించిన దానికంటె ఆయననే ఎక్కువగా బాధించింది:

> ఎఫ్రాయిము నా కిష్టమైన కుమారుడా? నాకు ముద్దు బిడ్డా? నేనతనికి విరోధముగా మాటలాడునప్పుడెల్ల అతని జ్ఞాపకము నన్ను విడువకున్నది, అతని గూర్చి నా కడుపులో చాలా వేదనగా నున్నది, తప్పక నేనతని కరుణింతును; ఇదే యెహోవా వాక్కు (యిర్మీయా 31:20).

దేవుని ప్రేమ తల్లి ప్రేమకంటెను ఎంతో గాఢంగా ఉంది:

> స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటి పిల్లను మరచునా?

> వారైనను మరచుదురుగాని నేను నిన్ను మరువను. చూడుము నా యరచేతుల మీదనే నిన్ను చెక్కియున్నాను. నీ ప్రాకారములు నిత్యము నా యెదుట నున్నవి (యెషయా 49:15, 16).

అవిధేయులైన ఇశ్రాయేలీయులను ఆయన శిక్షింపవలసి వచ్చినప్పుడు, ఆయనకు ఏ విధమైన సంతోషము లేదు: "వారి యావద్బాధలో ఆయన బాధనొందెను" (యెషయా 63:9ఎ). వారు తప్పు చేసినప్పుడు ఆయన దుఃఖపడ్డాడు; అయితే ఆయన పవిత్రతలో, వారిని బాధకు అప్పగింపవలసి వచ్చింది: "అయినను వారు తిరుగుబాటుచేసి ఆయన పరిశుద్ధాత్మను దుఃఖింపజేయగా ఆయన వారికి విరోధియాయెను" (యెషయా 63:10).

ఆదినుండి అంతమువరకు చూడగల సర్వజ్ఞుడు, తన ప్రజలలో కొందరు మారుమనస్సు పొందుతారని ఎరిగినవాడై, తన ప్రేమాతిశయమును బట్టి, క్రైస్తవ్యం కొరకు నమూనాను గీచాడు. క్రైస్తవులై యుండడంలోని ఉన్నత స్థితి, ఆయన రాజ్యంలో ఉండడమనే ధన్యత కంటికి కనబడలేదు చెవికి వినబడలేదు: "తన కొరకు కనిపెట్టువాని విషయమై నీవు తప్ప తన కార్యము సఫలముచేయు మరి ఏ దేవునిని ఎవడు నేకాలమున చూచియుండలేదు అట్టి దేవుడు కలడన్న సమాచారము మనుష్యులకు వినబడలేదు" అట్టి సంగతి వారికి తెలిసియుండలేదు (యెషయా 64:4). వాగ్దానం చేయబడిన తన రాజ్యంలో, నశించినవారిపట్ల దేవుని అక్కర శిఖరాగ్రము చేరుకొంది.

## నేడు పాపుల యెడల ఆయన అక్కర

తండ్రి యొక్క ప్రేమ మోయాబీయులకు, నీనెవెవారికి, ఇశ్రాయేలీయులకు మాత్రమే గాక, సమస్త జనములకు అది విస్తరింపజేయబడింది. దేవుడు పక్షపాతి కాడు. సర్వలోక పాపమునకును శాంతికరమై యుండునట్లు దేవుడు తన కుమారుని పంపాడు (1 యోహాను 2:2). ఎవడును నశించి పోకూడదనేది ఆయన యొక్క దృఢమైన అక్కరయై ఉంది.

2 పేతురు 3:9లో మనం యిలా చదువుతాం: "కొందరు ఆలస్యమని యెంచుకొను నట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడైయున్నాడు." అయనే మొదట మనలను ప్రేమించాడు గనుక (1 యోహాను 4:19). ప్రతి పాపియు, ఈ సత్యాలను ఎరిగినవాడై, ప్రేమ పూర్వకంగా ఆయనకు లోబడ బద్ధుడైయున్నాడు.